కవితామాలతి



నిడదవోలు మాలతి

2012

విషయసూచిక

1. చెలగాటం.

షేక్స్పియరూ, శ్రీకృష్ణుడూ

జీవితం ఒక నాటకం అన్నారు

నాకు మాత్రం

స్క్రిప్టు లేక

ప్లాటర్థం కావడంలేదు

రూల్సు లేని ఆటలా వుంది

అందుకే ఆడుతున్నాను

అఫెన్సే డిఫెన్సే

ఎదుటివారి ఎత్తుల్నిబట్టి

అంతమాత్రాన నావ్యక్తిత్వానికేమిటి లోపం?

2. దృష్టిదోషం.

తెలుగువారికి అఖ్కర్లేని సంగతి లేదు

ఎల్లరిబతుకులూ బజారుపాలు

ప్రతివాడికీ పొరుగువాడిగొడవే

అని మా నమ్మకం

ఇండియా మారిపోయింది

ఇప్పుడెందుకెళ్లడం

పూర్వపు అభిమానాల్లేవంచూ

వారించిన బంధుమిత్రులనీ, శ్రేయోభిలాషులనీ

కాదు కాదని

ఆకారవిశేషాల్లో

ప్లేను దిగిన నన్ను

ఆప్యాయంగా ఆదరించిన

బంధుమిత్రులని చూసి

ఆనందాతిరేకంతో

అవాక్కయిపోయేను.

ఏంజరిగిందేంజరిగిందంటూ

జనం పొడుచుకు తిన్లేదని

ఉప్పొంగిపోయేను.

తీరిగ్గా తరిచ్చూసుకుంటే

ఇప్పుడనిపిస్తోంది

నాగతం గురించెవరూ

అడగలేదని అప్పుడానందించేను

ప్రస్తుతం నాకెలా గడుస్తోందని

ఎవరూ అడగలేదని

ఇప్పుడు కొరతగా ఉంది!

3. తెలుగు నుడికారం

పాలవాడుకలా

వారాలబ్బాయిలా

క్రమం తప్పకుండా

హలో చెప్పడానికో

డైనింగవుటుకో

డ్రాయింగ్ లంచికో

కాల్చేసి కబుర్లాడి

ఓకేనండంటూ

కర్టెసీ కాలులు ముగించే

మిత్రబృందానిక్కరువు లేదిక్కడ

అమ్మదొంగా అంటూ అలరించి

హుందాతనం ఒలకబోస్తూ

కొడుకూ కోడలి ముచ్చట్లూ.

మనచేతుల్లోని మడుసులూ

కోప్పడేసే మినిష్టర్లగొడవలూ లాటి

ఊసులాడుకోడానికి

మనాళ్లు కావాలంటే మాత్తరం

అంజనంవేసి సూస్కోవాల.

(పై మూడు కవితలు ఆంధ్రప్రభలో (15 సెప్టెంబరు 1997) ప్రచురితం.)

4. బొమ్మా - బొరుసూ

రిప్ వాన్ వింకిల్‌లా

ఇరవైయేళ్లగా నిద్రపోతున్న నన్ను

తట్టి లేపింది

చిన్నినాచుట్టం

ఏరాడకొండమీంచి

ఏడుకొండలమీంచి

సప్తసముద్రాలూ దాటి

చేరుకున్నాను పరమపదం

ఎటు చూసినా

కటిక చీకటి, అయోమయం

భాష వేరు

భావాలు వేరు

విశ్వాసాలు వేరు

ఆశలు వేరు

ఆశయాలు వేరు

కళ్లు పొడుచుకు చూసినా

మనవాళ్ల మొహాలే

మరోలా కనిపిస్తున్నాయి

ఆనాటి కట్టుబాట్లు

అనువు కాని చోట

ఆపద్ధర్మాలు

గతంలో

ఘనత వహించిన

కులధర్మాలకి

కొత్తభాష్యాలు

పుట్టుకతో వచ్చిన

విలువలు పూర్వవాసనలు

ఎంత కాదనుకున్నా

వదల్డంలేదు

జీడిమరకల్లా

యాదాలాపంగా

అక్కడా అక్కడా

కలిసిన కొత్తమొహాలు

తరతరాల ఆచారాలకి ఆనవాళ్లు

పండుగలకీ పబ్బాలకీ

పుట్టినరోజులకీ

గ్రాడ్యేషనులకీ

విందుభోజనాలకీ

సత్యనారాయణవ్రతాలకీ

రారమ్మని పిలుపులు

పరంపరాగత సాంప్రదాయాలోపక్కా

స్థానికమర్యాదలు మరో పక్కా

కొరుక్కు తింటున్నాయి

చెదపురుగుల్లా

బతుకంతా

కలగాపులగం

గందరగోళం

అయోమయం

అంధకారబంధురం

ఏకాకీ యతచిత్తాత్మా

నిరాశీరపరిగ్రహః

కమ్మని గీతావాక్యం

మేలుకొలుపులు పాడిన మిత్రమా

నువ్వే చెప్పు

ఈచిక్కు విడేదెప్పుడు?

(6 ఆగస్టు 1996)

5. ధర్మకాటా

ఆకలేస్తే అన్నం తిను

చలేస్తే దుప్పటీ కప్పుకోమంటూ

నోటిలెక్కల్లా

బహుతేలిక

ఈనాటి నాగరీకప్రపంచంలో

ప్రతిసమస్యకీ

రెడీమేడ్ జవాబు

కంటికానని

అనుభవాలు

పరమాణుల్లా

కోటానుకోట్లు

అణువణువూ

గతానుగతికంగా

ప్రపంచాన్ని పాలిస్తోంది

చట్టాలని సృష్టిస్తోంది

    నమ్మండి నమ్మకపోండి

    అంతరాంతరాల్లోంచి

    పుట్టుకొచ్చే వణుక్కి

    దుప్పట్లెక్కడా దొరకవు

    అకాడమీలందిచ్చే

    ధర్మనిర్ణయాలు

    సామాన్యులకి

    సాంత్వన కూర్చవు

    వారి తీర్పులు

    వీరి బతుకుల

    మూసపోసిన అచ్చుల్లా

    అమరవు.

    (10-24-1997)

6. తుదిపలుకు. పోయిరావమ్మా తిరిగిరాని చోటికి ...

కోటానుకోట్ల

యువహృదయాల

ప్రతిధ్వనిస్తూ

రవి అస్తమించని మహాసామ్రాజ్యపు

యువరాణి

సాగించెను తన అంతిమయాత్ర

నల్దిక్కులా

ఆమెచిత్తరువు

చిరునవ్వుతో

కవ్వించే కనులతో

పరువళ్లు తొక్కే పరువంలో

కలవారి లోగిళ్ల

చావు పెళ్లితో సమం

రంగరంగ వైభవం

ఇది చావు కాదు

Celebration of life.

మరోమూల

కలకత్తా చీకటికోణాల్లో

లక్షలాది

దరిద్రనారాయణులమధ్య

నిశ్శబ్దంగా

నిరాడంబరంగా

కన్ను మూసెను

ఒక పెద్దతల్లి.

వయసులూ, అంతస్థులూ

అసంపూర్ణంగా

వదిలేసిన ధర్మకార్యాలు

తనపై ఆశలు పెంచుకున్న ప్రజాసందోహం

సర్వం తెజించి

చేరుకొనిరి పరమపదం.

వారూ, వీరూ

చివరకు చేరిరి

ఒకే స్థానం

డస్ట్ టు డస్ట్.

(ప్రిన్సెస్ డయానా, మదర్ తెరిసా మరణించినసందర్భంలో. 9-6-1997)

7. అనామకులు

లోకాన

నలుగురో పదిమందో

ధీరులు, పరమయోగులు

జ్ఞానులు, తాత్త్వికులు

నాయత్వం వహించి

పదిమందికి మార్గదర్శకులు

విశ్వాసంతో ముందు నడుస్తాు

మంచి జీవితం ఎలా ఉండాలో

Happiness అంటే ఏమిటో

శాస్త్రనిర్ణయాలు చేస్తారు

వారి వెంట

అనేకానేక జనానీకం

ముందు వారందించిన

పడికట్టురాళ్లు నెత్తికెత్తుకు

వారి భాషణలు

వల్లె వేసుకుంటూ

ఆ ఉప్పే వెనకవారిక్కూడా

పంచిపెడుతూ

పరమానందంగా ముందుకి సాగుతారు.

మూడోరకం ఉన్నారు

ఎందునా పొందనివారు

ఏ దిక్కూ తోచనివారు

దారిపక్కన

క్రీనీడన పొంచుని

ఆశ్చర్యంతోనో

అమాయకత్వంతోనో

అయోమయంగానో

అసహాయంగానో

నిలబడిపోతారు.

ముందున్న నడుస్తున్న నాయకుల్నీ

ఆ వెనక ఉత్సాహంగా

ఉరకలలేస్తూ సాగిపోతున్న

జనసందోగాన్నీ

చూస్తూ

Alice in Wonderland లా

అంతరార్థాలు వెతుక్కుంటూ

వాళ్లు

ఊరూ పేరూ లేనివాళ్లు

సెత్తిన డాలరు పెడితే డైముకి చెల్లనివారు

వారివల్ల కూడా ఉందోలాభం

ప్రతి మార్గదర్శకుడికీ

దరిచేరిన భజనపరులతోపాటు

మరో మంద కూడా

ఉంటేనే సంతృప్తి

ఎలక్షన్లలో ఓటరులలా

ముగ్గులోకి దింపడానికి.

అప్పుడే నాయకులకి

తమగోలులతో పరిపూర్ణ తాదాత్మ్యం.

నిరీక్షణ

చిన్నప్పుడు
స్కూల్ బస్సుకోసం
చల్లని సాయంత్రాలకోసం
ఆ సాయంసమయాల
బీచిలో ఇసకలో కట్టే పిచిగ్గూళ్లకోసం
ఆగూళ్లలో చేరే పిట్టలకోసం

పెద్దపండుక్కోసం
పట్టుపరికిణీకోసం
గోదావరి ఆనకట్టపై
పరుగుల్తీసే రైలుబండీకోసం
ఆ రైలుబండీకమ్మీల్లోంచి
చిమ్మచీకట్లు చీల్చుకుంటూ
కురుసే వెలుగులతోరణాలకోసం

ఏతావాతా
చదువుల్తెచ్చే డిగ్రీలకోసం
డిగ్రీలిచ్చే ఉద్యోగాలకోసం
ఉద్యోగాల్లో ప్రమోషన్లకోసం
ఆప్తుల ఆమోదముద్రకోసం

నాలుగువీధులకూడలిలో

పచ్చవెలుక్కోసం
మనసిచ్చి మాటాడే మనిషికోసం
అలనాటి ఆప్తురాలు
కాకమ్మచేతనైనా అంపే కబురుకోసం
ఋజువైన చెలిమికోసం
    ఎండకోసం
    వానకోసం
    ఆకురాలు కాలంలో
    కొమ్మలు చిమ్మే వింత సొగసులకోసం
    తిరిగొచ్చే చివుళ్లకోసం
    ఎదురుచూస్తున్నాను అర్ధశతాబ్దిగా
    మూడంతస్థులమేడల్లో
    ఐదంకెల ఆదాయాల్తో
    కోరితెచ్చుకున్న ఈతిబాధల్తో
    వాలుకుర్చీల్లో విలాసంగా
    వెనక్కి వాలి
    భారతీయసంప్రదాయం,
    వైరాగ్యం, ఔన్నత్యం గూర్చి
    వివరిస్తుంటే
    వింటున్నాను ఓపిగ్గా.
    తరంగాలెత్తే స్నానం చేస్తానంటూ
    సముద్రపొడ్డున

ముడుచుక్కూచున్న బడుగుబాపడిలా

ఎదురుచూస్తున్నాను.

ఏఉద్గ్రంథానికో

అస్తవ్యస్తంగా రాస్తున్న

నాందీప్రస్తావనలా వుంది

జీవనహేల.

తుదిపలుకు ప్రసక్తి లేదు మరి.

(తెలుగు అసోసియేషన్ ఆఫ్ గ్రేటర్ షికాగో, తెలుగువెలుగు, 2003, లో ప్రచురితం.)

8. అప్పగింతలు

అమ్మాయిని ఏవూరిచ్చారు, చిలకలపల్లేనా?

లేదమ్మా, సిలికాన్ వాలీలో పడేశాం.

ఇరుకుగదులూ, మురికివాడలసొద తప్పుతుందని.

అక్కడ చలెక్కువ, ఖర్చులు తక్కువ

ఆదాయాలెక్కువ

సుఖశాంతులకి మరి కొదవేలేదు

అల్లుడు బ్రెయిన్ సర్జనవుతాడో

రగ్ డాక్టరవుతాడో ఇంకా తెలీదు

కాని అక్కడ సుఖాలు మాత్రం ఎనలేనివి

అందుకే చిట్టితల్లికి బోధ చేసేను

ఎంచక్కా నలగని దుస్తులు

చెరగని క్రాపులు

అలుపులేని పనులతో

కాలం కరిగిపోతుంది

రోజుకి ఇరవైనాలుగ్గంటలు చాలవు అనుభవించడానికి.

వాషర్లూ, డ్రైయర్లూ,

ఏక్ మినిట్ వంటకాలూ, టీవీ డిన్నర్లూ

ఆపైన హోటళ్లూ, సినిమాలూ, డీవిడీలూ

వారంవారం పార్టీలూ

అబ్బే, అక్కడ నువ్వు వండక్కర్లేదు

అంతా కేటరింగే.

అంతకన్నా ఏకన్నెపిల్ల మాత్రం

ఏం కోరుకుంటుంది?

అత్తాఆడబడుచుల పోరుండదు హాయిగా

అతనొక్కడే చాలు అందరిపెట్టు లాటి మాటలనకు

నొచ్చుకోగలడు.

అల్లుడు చదువుకున్నవాడే

మంచీ చెడ్డా మాటాడుతూఊఊఊఊ

వుంటాడు పొద్దస్తమానం ఆపకుండా.

అతిథులు వచ్చినప్పుడు

గరిట పుచ్చుకు నిలబడతాడు

విద్యుత్ పొయ్యిముందు విలాసంగా

కేవలం నీపరువు నిలబెట్టడానికే.

చూడచక్కని సుందరదృశ్యమది

అమర్చినదానిలో అత్తగారు వేలు పెట్టినట్టులాటి

సామెతలు వాడకు

పాపం అతడిమనసు బాధపడుతుంది.

ప్లేను దిగ్గానే కారు కొనిచ్చేస్తాడు.

హాయిగా తిరగొచ్చు

అతడిని ఆఫీసులోనూ

పిల్లల్ని స్కూళ్లల్లోనూ

దిగిడిచేసింతరవాత.

అలా తిరుగుతున్నప్పుడే

ఇంటిక్కావాల్సిన కూరా, కాయా

ఉప్పూ పప్పూ

తెచ్చేసుకోవచ్చు.

చూడవచ్చిన చుట్టాల్నీ పక్కాల్నీ

బజార్లంట తిప్పొచ్చు.

అలా తిరగడానికి

ఓపిక లేదంటూ నస పెట్టకు

తప్పు తల్లీ, మరియాద గాదు.

మునిమాపువేళ

ముఖాన రవంత చిర్నవ్వు మేకప్పేసుకుని

కనిపిస్తే చాలు, పరమానందపడిపోతాడు

సంసారం సాఫీగా

తార్రోడ్డుమీద కాడిలాక్కులా తూగిపోగలదు.

అవున్నిజమే,

మనూళ్లలోకి మల్లే

పుట్టింటికి పోతానంటూ

బస్సెక్కి వచ్చేడానికి

ఆర్టీసీ బస్సో హౌరా ఎక్స్‌ప్రెసో అందుబాటులో వుండదు

మనవాళ్లుంటారు కానీ

మనసిచ్చి మాటాడుకునే వసతుండదు.

అంతమాత్రాన

నువ్వు బాధపడుట తగదు సుమా

కావలిస్తే అర్థరాత్రి నిద్ర పట్టనప్పుడు

లేచి కూచుని కథలో కవితలో రాసుకో

అభ్యంతరము చెప్పడు నీనాథుడు.

నీరచనల ఆశోకవృక్షానికి దోహదక్రియ

సలుపగల ధీరోదాత్త నాయకుడతడు.

మనసాహిత్యచరిత్రనిండా చచ్చినన్ని

సాక్ష్యాలున్నాయి ఈవాదన ఋజు చేయడానికి.

ఆనక చూపుతా అవుసరమయితే.

లే, తల్లీ,

మానుకో నీమనోయాది

తుడుచుకో కన్నీరు

ముడుచుకో విరులు

ఎగిరిపో వియత్పథాన

వేయికనులతో వేచియున్న

ఆ పరమపురుషుని సన్నిధికి.

(నవంబరు 2004. ఈమాట.కాంలో ప్రచురితం.)

9. కొడక్ క్షణాలు

పక్కలేన్‌లో

డెబ్బైమైళ్ల స్పీడ్‌తో

దూసుకుపోతున్నకారులోంచి

దేశవాళీ పాప

మామీ అంటూ

వేలెత్తి చూపిన సుందరదృశ్యం

పూజక్కాదు కానీ

భోజనానికొస్తాననే

కొత్త తెలుగుబాలుడి హుషారు

మీయింటికొస్తే

అమ్మగారింటికొచ్చినట్టుందనే

కొత్తపెళ్లికూతురి

వదనంలో నిర్వేదం

పట్టుచీరెలో

పండుతలతో

మౌనంగా నిలబడిన

వయసుమళ్లిన ముత్తైదువుని

ఎత్తుకోమంటూ చేతులు చాచిన

బుల్లిపాపాయి

కోల్స్‌లో

క్యూలో

తెలుగుయాస విని

చప్పున విప్పారిన అక్షిద్వయం

ఫోన్ బుక్ తీసి

రాజుగారినీ

రెడ్డిగారినీ

శాస్త్రిగారినీ

శర్మగారినీ

పిలిచేసే కొత్త మాష్టారు

అమెరికా ఖండాన

అనుదినమెదుయే

మధురక్షణాలు.

అంతరాంతరాల

అణిగిమణిగిన ఆర్తికి ఆదర్శాలు.

10. తాటిచెట్టు నీడ

సైడ్ వాక్ పై సభలు తీరిన తరుసంతతి

నాతలపై నటరాజతాండవం అనుదినం

తొలిసంజవెలుగులు నడివీధిలో

మలిసంజదీపాలు పొరుగులాన్‌లపై

నడిపొద్దు నీడలు కుదురుమట్టాన

నాతల కాయని నీడలు

నాగొడుగుపట్టని వనరులు

పల్లెకో సంత

వూరుకో సదస్సు

వాడకో సంఘం

మనిషికో మతం

వాదాలు, వివాదాలు

నినాదాలు సునాదాల వెన్నంటి

రెడ్డిరాజులు

కమ్మప్రభువులు

సెంటరుఫీల్డులో సుబ్రాహ్మణ్యాలు

పులుసులో ముక్కలు

చిన్నా పెద్దా

తెలుపూ నలుపూ

ఆడేవారూ పాడేవారూ

పక్కతాళాలవారు

చెక్కభజనలవారూ

చీకాకోలునించీ శ్రీరామకుప్పంవరకూ

వూరిపేర్లనుండీ వారసత్త్వాలవరకూ

ఆరాలు తీయువారు

పేరుపేరు పేరులవారు

ఆనామకులకూ అంగుష్ఠమాత్రులకూ

ఆశల్ రేపుతూ దారంట తాళవృక్షాలు.

(ఆగస్ట్ 2006)

11. నాకు నవ్వొస్తోంది

మనమ్ మనమ్ తెలుగులమ్,

కలిసి మెలిసి చెలగిన కలదు సుఖమ్

అంటూ నావెన్ను చరిచి

తమ వెసులుబాటులు తడుముకునే

జాతిమొహాలతీరు చూస్తే

నాకు నవ్వొస్తోంది.

నువ్వు నొల్లుకున్న సిరులు

నాకు పంచిపెట్టు

నేం తలపెట్టిన ఘనకార్యమ్మీద

నీఆమోదముద్ర వెయ్

తన్మూలంగా

నీకేం ఒరుగుతుందని అడక్కు

నీ ఆలోచనలూ, అవసరాలూ

ఆశయాలూ, నీతులూ

నాదగ్గిర వల్లించకు

అంటూ

వేదవేదోపాంగాలకి సాధికారంగా

నవ్యభాష్యాలు తిరగరాస్తున్న

ఘనాపాఠీల్ని చూస్తే

నాకు నవ్వొస్తోంది.

తలమీద డాలరెట్టి వేలంవేస్తే

డైముకి చెల్లని దౌర్భాగ్యుల్నుండీ

ఉచితసేవలకోసం వెంపర్లాడే

సుహృన్మణిశేఖరుల్ని చూసీ

సొల్లుకబుర్ల సుబ్బారాయుళ్లన్చూసీ

ఏడవలేక నవ్వుతున్నాను.

ఏంచెప్పను మరి నాకు నవ్వొస్తోంది

అమ్మలారా, తమ్ములారా

నాహాస్యరసమును పోషించు ధీమతులారా

అమ్మతోడు

నాకంప్యూటర్ నీలితెరమీద

మీఅస్తిత్వాలు, ఆంతర్యాలు చూస్తేనే చాలు

నాకు నవ్వొస్తోంది.

ఏ దండిపండితుల ఉద్యత్‌వచోవిభ్రమాలకీ

అందని ఔద్ధత్యంతో నాకు నవ్వొస్తోంది.

నిజంగానే ...

నాకు నవ్వొస్తోంది.

(నవంబరు 2006)

12. గ్రహ బలాబలాలు.

సూర్యమాన గ్రహచారంలో

దలైలామా, అమెరికాఅధ్యక్షుడూ కేన్సీరియన్లు

ఉభయులకూ కేంద్రం ఆత్మ.

ఒకరికి ఆదర్శం ఆత్మావలోకనం

రెండోవారు చేస్తున్నారు ఆత్మప్రదక్షిణం

ఒకరికి ఆలంబన విశ్వమానవసౌభ్రాతృత్వం

రెండోవారికి విశ్వం సర్వస్వామ్యసంకలితం.

ధృవాంతరసీమలకు విస్తరిల్లిన

వారి తేజోపుంజాలు

మిరుమిట్లు గొల్పుతున్నాయి

కళ్లు బైర్లు కమ్ముతున్నాయి.

అలివికాని అంధకారంలో

మురికివాడలో

ఇరుకుగదిలో

వెతుక్కుంటున్నాను

ఆల్పిప్పంత జాగాకోసం.

మూడోపాదం మోపనున్న వామనుడిలా.

నేను మూడో కేన్సీరియనుని.

(జూన్ 23, 2007. ఈమాట.కామ్ లో ప్రచురింపబడింది.)

12. అస్తి నాస్తి

మహోత్తుంగ శిఖరాగ్రాల

ఢీకొన్న విద్యున్మణిమేఖలాశకలాలు

కరిపై లంఘించిన కొదుమసింగమువోలె

పరిషించుకుపోయిన

అంభోరాసినడుమ

ఏకైకదీపశిఖనయి

నిల్చున్నాను

దృక్కులు సారించినంతమేరా

అపారపారావారం

ఇదా ప్రళయం?

ఇది కలికాలం మలిపాదమా?

నేనున్నానా? లేనా?

లేనిదానినై వున్నానా?

తరులు

గిరులు

సురాసురులు

నగలు

వగలు

పగలసెగలు లేని

శ్మశానం ఆవరణంలో

ప్రశాంతి.

ఇది కలా?

ఇది కలేనా?

ఈశ్మశానంలో

నాఅవసానం చూస్తున్న

నేను వున్నానా? లేనా?

లేనిదానినై వున్నానా?

ఉన్నా లేనివారికింద జమఅయిపోయేనా?

13. లోకం మేలుకొన్న వేళ

కబుర్లు చెప్పుకుందాం

రారమ్మంటూ పిలిచెనో కవయిత్రి

మీకత చెప్పమంటూ

కలం పుచ్చుకున్నదో జర్నలిస్టు

మీవ్యాసం పునరపి వేసుకుంటామంటూ

ప్రకటించేరు మరో జర్నలిస్టు

మాకో వ్యాసం రాసిమ్మంటూ

ప్రత్యేకాహ్వానించింది

ఓ విశ్వవిద్యాలయ ఆంగ్ల సారస్వతపత్రిక

తిరిగి టెల్గూ టీచింగు

చెయ్యమంటోంది SASLI[1]

ఏకకాలంలో

హోల్ మొత్తం లోకం మేలుకొని

నా అస్తిత్వానికి ఉదయగీతికలు

ఆలపించినట్టనిపిస్తోంది.

అహో! ఏమి చెప్పను!

అదుగో మాలతి ప్రభవించిందంటూ

అరవబోతే విడలేదు గళం

అతిశయాల నిశ్శబ్దం

వేసుకుంది తెరలు తెరలుగా

అరవిరిసిన గులాబీరేకుల్లా

ఏఁవిటా తొందర?

ఇంకా తెల్లవారలేదంటూ.

[1] South Asia Summer Language Institute

ఇది రెండేళ్లకిందటి మాట.

ఈనాడు నవ్వులాట!

14. శునకేంద్రభోగాలు

ఈనాడు మానాట

కుక్కలకు గౌరీకల్యాణం

కాకులను కొట్టి గద్దలకు వేసినట్లు

ఆవుల కోసి కుక్కల మేపుట

సర్వసాధారణమిచట

కుక్కతిండికి వ్యయం ఏటికి పదహారు బిలియనులు

గ్రామసింహాల పళ్లు తోమడానికీ

ఒళ్లు కడగడానికీ

మరో తొమ్మిది బిలియనులు

యజమానులు తమముఖాలకి

అద్దుతున్నారు

ముద్దుకుక్కల ముఖవిలాసం

కుక్కలకున్నాయి

ఫర్‌కోటులూ, ఆభరణాలూ

అందాలపోటీలూ,

ఆరామస్థలాలూ

సంఘాలు, సమావేశాలు

వెరసి వ్యయం

యేటికి యాభై బిలియనులు

మాసార్వభౌముల

సలహాదారులు లోరా, బార్నీ,

వారిలో బార్నీ వాక్కులకే అధికప్రాధాన్యం

అంటారాయన.

అందుకే పట్టింది

సామాన్యులకి కుక్కగతి

మానవజన్మనెత్తి

నానా ఆగచాటులు పడుటేల

అమెరికాలో కుక్కగా

పుట్టిన కలుగు అష్టైశ్వైర్యాలు,

అనన్యసామాన్యమైన భోగభాగ్యాలు

(జనవరి 2008)

15 సంతాపసభ

ఈమధ్య ఎంచేతో

ఒబిచ్యురీ కాలమ్ చూసినప్పుడల్లా

ఇవే ఆలోచనలు నాకు.

నా దుకాణం ఎత్తేస్తే
ఎవరేమంటారా అని..
ఇప్పుడే తెలిసింది
అయ్యో కొట్టు మూతపడింది
నాణ్యమైన సరుకు
అందించిన షాపు
తెలుగుకీర్తి
దేశదేశాల చాటిన మేటి షాపు
మరి లేదిక మనకి
అంటూ వాపోతారని.

దిక్కులు చూస్తున్నా
నాకొట్లో కూచుని.
ఎలా చెప్పను
నేనింకా బతికే వున్నానని
నాదుకాణం తెరిచే వుందని.
ఇంకా నాకు మూడలేదు
మీ మెప్పుకోళ్లకిది
సమయం కాదు.

దుశ్శాలువలకీ
పుష్పగుచ్ఛాలకీ
సంతాపసభలకీ
ఇంకా టైముంది.

తొందరపడకండి.

(ప్రాణహితలో నా తూలిక.నెట్ ఇప్పుడు లేదని ప్రకటించినవార్తకి స్పందించి. సెప్టెంబరు, 2008.)

16. నాగురించి, మరోసారి.

పేరు మాలతి

ఇంటిపేరు నిడదవోలు.

మిక్సవకండి మరో మాలతితో.

వయసు చెపితే ఝుడుసుకుంటారేమో

వున్నాయి డెబ్భైకి పైనే

నాకుంది ఒక అమ్మాయి

పేరు సరయు, వృత్తి నటన

వోత

నారాతలు నాకాలక్షేపం,

కంప్యూటరు నా నేస్తం

కీబోర్డే నా సమస్తం

టీవీ ఇష్టసఖి

ఇష్టమొచ్చినపుడు

ఇష్టమయినవి తినడం నా సరదా

తిరగడం మరో సరదా

నాగూట్లో నేను

ముడుచుకు పడుకోడమే

నాకు పరమానందం.

నామటుకు నాకు అదే పరమయోగసారం.

(అక్టోబరు 2008.)

17. ఆతపచ్ఛాయలు

నిండుకుండ

ఆమె నిండుకుండ

అయినవాళ్లూ, కానివాళ్లూ కుమ్మరించిన

కన్నీళ్లతో, ఆనందాశ్రువులతో

నిండిపోయిందా కుండ.

శాంతమూర్తి

అతడికి కోపం రెచ్చింది

ఆమె మౌనం వహించింది.

ఆ యింట శాంతం

వెల్లివిరసింది ఆసాంతం.

యుద్ధం ముగిసిన రాత్రి

నడిచి నడిచి అలసిపోయిందామె

నడవనంటూ మొండికేశాడతను

ఇద్దరూ ఆగిపోయారు ట్వైలైట్ జోన్‌లో.

మగ్నోలియాలు

మేలో రెండు వారాలపాటు

నిండుమనసులా

వెల్లివిరిసే మగ్నోలియాల సుందరదృశ్యం

కెమెరాలో పట్టబోతే తెలిసింది

నేను రెండువారాలు ఆలస్యమని.

ఆరుద్రగారు చెప్పినట్టు

నేను ఎక్కబోయినరైలు

మగ్నోలియా కాలమానంలో

ఓ జీవితకాలం లేటు.

(21 మే 2009)

18. ఇంద్రజాలం

(నాస్నేహితురాలు వైదేహి తను కొత్తగా రాసినకవిత, **కచేరీ**, నాకు పంపినప్పుడు, అది చదువుతుంటే కలిగిన స్ఫూర్తితో రాసిన కవిత ఇది. నేను ఆ ఫైలు తెరుస్తుండగా మొదలయినవాన చదవడం పూర్తయేసరికి ఆగిపోయింది ఆశ్చర్యం!)

మిత్రమా!

చూడమంటూ నువ్వంపిన ఫైలు

తెరవబోతున్న క్షణంలో

తటాలున కిటికీలో వెలిగిన తటిల్లత

ఆవెంట గర్జించిన ఘనమేఘమాల

కిటికీలో అమర్చిన అద్దానికి

అటువేపు వానచినుకుల దరువులు

ఇటువేపు నేను అప్రతిభురాలినై!

నీ సరసపదకేళి

కన్నులతో ఆస్వాదిస్తుంటే,

ఏటవాలుగా

జాలువారుతున్న

జీవధారారవళి నేపథ్యంలో

సుమధుర గానసభ

కళ్లముందు

సాక్షాత్కారించింది.

నీకవితాగానం

ముగిసిందన్న

స్పృహ లేదింక మరి.

అయ్యో అప్పుడే అయిపోయిందా

అనుకుంటూ కళ్లెత్తి చూశాను

ఆకాశం నాకేసి చూపులు సారించి

నవ్వుతోంది నిర్మలంగా

ఇంద్రజాలమంటే అదేనంటూ.

(14 మే 2009)

19. పలుకు తేనియలొలుకు

Before daybreak లేచి

Breakfast చేసి

Freshen upప్పయి Officeకెళ్లి

Late evening ఇల్లు చేరి



Daddyకో hugయ్యమ్మా అంటే

పో, నాన్నా, నిద్దలొతూందంటూ

ఒత్తిగిలి నిద్దరోయింది

చక్రాలబండి తొక్కి తొక్కి అలసిపోయిన పాపాయి.

000

కాలం అపురూపం

ఎక్కడయిపోతుందోనని

కొసరి కొసరి కొరుకుతూ తింటోందామె

అమ్మమ్మ పెట్టిన అరిసెల్లా.

అనుభవించకపోతే అరచేతిలో స్వర్గం చేజారిపోతుందని

ఉరుకులూ పరుగులూ పెడుతున్నాడతను వగరుస్తూ.

కాలం కదులుతోంది తనమానాన తను.

000

అవ్యక్తమధురం

కొందరిజీవితాల్లో ఆత్మస్పర్శలు

సాగుతాయి సమాంతరంగా.

అవి కలవవు, విడిపోవు.

వారి బాంధవ్యం

సాగుతుంది సరస్వతీనదిలా

అవ్యక్త పట్టాలమీద

‘‘ఔరా’’ ఎక్స్‌ప్రెస్ అయి.

(June 30, 2010)

20. హరివిల్లులు రెండు విరిసేముందు ...

‘‘చూడు, చూడు, నేనేం కనుగొన్నానో‘‘

అంటూ తెచ్చి పరిచింది మాఅమ్మాయి నాముందు

నాచిన్ననాటి ఇత్తడి బొమ్మలు

బేస్మెంట్ చీకటి కొట్లో అట్టపెట్టెల్లో

ఏమూలో మూలుగుతున్న అనర్ఘ రత్నాలు



"తీసుకు పో" అన్నా.

"నాపెట్టెలో చోటులో లేదు

పోస్టులో పంపించ"మంది

"సరేన"న్నాను.

దాని సరదా చూసి

ఇనుమడించిన ఉత్సాహంతో

పాలిష్ చేయ పూనుకుంటే జరిగింది ప్రమాదం.

నా జబ్బపుష్టికో ఉత్సాహానికో తట్టుకోలేక

టుప్పున విరిగేయి నెమలితల్లి కాళ్లు రెండూ

నిలవలేక నేల కూలింది పక్షిరాజం.



అయ్యో, అయ్యో అనుకుంటూ

ఊరంతా గాలించేను వెల్డరుకోసం

రోజంతా తిరిగేను ఆ నెమలిని

దానికాళ్లమీద నిలబెట్టడానికి.

విసిగి, వేసారి, చేరుకున్నా నిల్లు.

ఉసూరుమంటూ కూలబడ్డాను సోఫాలో.

మొద్దుబారిన మనసుతో.

ముప్పైఏళ్లుగా దాచిన పక్షి

ఇప్పుడెందుకు కనిపించాలి మాపిల్లకి?

కనిపించె బో, పోస్టులో పంపమననేల?

పోస్టులో పంపమనె బో

పాలిష్ చేయ బుద్ధి పుట్టనేల నాకు?

పుట్టెబో. నేనెందుకు హేండిల్ చేయవలె

దాన్ని అంత కేర్లెస్‌గా?.


నవనాడులూ కుంగిపోతున్నాయి గుండెల్లోంచి పాదాల్లోకి.

నిస్పృహతో నిస్సత్తువగా వెనక్కివాలి

కళ్లు తిప్పేను patio door వైపు.

అహో. ఏం చెప్పను ఆ సుందరదృశ్యం

జన్మలో కానని అత్యంత అద్భుతం!



రెండు చేతులు చాచి పుడమితల్లిని కౌగలించుకుంటున్నట్టు

వినువీధిలో ఇంద్రధనుస్సు పరిపూర్ణ అర్ధచంద్ర సదృశం

ఈచివరినుండి ఆచివరికి కర్ణమూలాలకి లాగి ఎక్కుపెట్టిన శివధనుస్సులా

ఎగిరిపడుతున్న కళ్లతో గాజు తలుపు పక్కకి లాగి మళ్లీ చూశాను.



తొలివింటికి సమాంతరంగా మలి హరివిల్లు

అభయముద్ర పట్టిన సుప్రసిద్ధనాట్యకత్తెలా

నిగడదన్ని అనంతాల్లోకి విజృంభించిన రెండో హరివిల్లు

వర్ణించడానికి మాటలు లేవు.

చిత్రించడానికి చేతకానిది నా అణాకాణీ కెమెరా.

ఆక్షణాన మాయింటి అద్దాలతలుపువెనక వెల్లివిరిసిన

అనన్యసామాన్య సంభ్రమాశ్యర్యాలు గుప్పించిన సురుచిర సౌందర్యరాశిని

మీఊహకి వదిలిపెడుతున్నాను.

మీ పంచేంద్రియాలనీ, అనంతమేధోసంపత్తినీ సంధించి

వాటికి పని ఒప్పచెప్పినప్పుడు

గ్రహించగలరు అప్పటి నా అనుపమ హర్షోద్వేగాలు!

సుప్తచేతనని సైతం అలరించగల సప్తవర్ణాలు శోభాయమానం.

(జూన్ 19, 2010)